క్లుప్తంగా

పంచాయతీలో డీఎల్పీఓ తనిఖీ

కరకగూడెం: మండలంలోని రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని భద్రాచలం డీఎల్పీఓ సుధీర్ కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. గ్రామ పంచాయతీ తీర్మానాలు, ఆదాయ వ్యయాల పట్టికలు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ రికార్డులు, పన్నుల వసూళ్లు, ప్రభుత్వ పథకాల అమలు వివరాలు వంటి వాటిని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టికలు వారి పనితీరును కూడా సమీక్షించారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మారుతీ యాదవ్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో 'ఫోన్ మిత్ర'



ఫోన్లలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

ములకలపల్లి: గురుకుల పాఠశాల/కళాశాలల్లో ఏర్పాటు చేసిన 'ఫోన్‌మిత్ర' సేవల ద్వారా విద్యార్థులు సోమవారం తమ తల్లిదండ్రులతో యోగక్షేమాలు మాట్లాడుకుంటున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫోన్ల ద్వారా ప్రతీ చిన్నారి, రోజుకు 6 నిముషాలపాటు ఫోన్లో మాట్లాడే వీలు కల్పించారు. ఇందుకుగాను ప్రత్యేకంగా కార్డులు ఏర్పాటు చేశారు. ములకలపల్లిలో గురుకుల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో మొత్తం 600 మంది విద్యార్థులుండగా, 6 ఫోన్లు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తరగతుల సమయం మినహా మిగతా సమయాల్లో ఫోన్లో మాట్లాడే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణికి విద్యార్థులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ వితరణ కార్యక్రమంలో మస్తాన్‌వలీ

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇదే గ్రామానికి చెందిన మహమ్మద్ మస్తాన్ వలీ(బాబు) తన తండ్రి మహమ్మద్ మజహారుల్లా బేగ్ (షాహ్) జ్ఞాపకార్థం రూ.10వేలు విలువ గల కాపీ రైటింగ్ పుస్తకాలు, నోట్ బుక్స్, పరీక్ష ప్యాడ్లు, పలకలు, స్కూలుకు సంబంధించిన స్టేషనరీ సామాగ్రిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్ వలీని పాఠశాల ఉపాధ్యాయులు బొడ్డు నాగేశ్వరరావు, హైమావతిలు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి సహాయపడుతున్న యువకులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బేరి వీరేందర్ రెడ్డి, మద్ది సందీప్, గోసుల వెంకట్, జమలాపురి ఎల్లోజి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

సీట్లు పెంచాలి..

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ గిరిజన బీఎడ్ కళాశాలలో డీఎడ్ సీట్లు పెంచాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒకే ఒక గిరిజన బీఎడ్ కళాశాల కావడంతో షెడ్యూల్ ఏరియాల నుంచి అర్హులైన గిరిజన విద్యార్థులు, బీఈడీ, డీఎడ్ టీటీసీ కోర్సులు చదువుకోవడానికి వస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే గిరిజన సంక్షేమ శాఖ భద్రాచలం బీఎడ్ కళాశాలకు అదనంగా డీఎడ్ 50 సీట్లు పెంచాలని స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌ను కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌కు లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇర్పా ప్రకాష్, పూనెం వరప్రసాద్, పాలెం నాగరాజు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు పున్నంచంద్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు మధ్యాహ్నం సమయానికి కూడా రావటం లేదని, వచ్చిన తరువాత గంట, రెండుగంటలు ఉండి ఇంటి దారి పడుతున్నారని ఆరోపించారు. అధికారుల తీరులో మార్పు రాకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మరుగున పడిన బ్రిడ్జి ప్రతిపాదన

- పత్తాలేని చినరాయిగూడెం-పర్ణశాల వంతెన
- నాడు నిధులు మంజూరైనా పునాది పడలే..
- నేడు తీగల వంతెనకు ప్రజల మొగ్గు
- ఏర్పాటైతే పర్యాటకం వృద్ధి



బ్రిడ్జికి ప్రతిపాదించిన చినరాయిగూడెం వద్ద గోదావరి నదీ ప్రాంతం..

మణుగూరురూరల్: అభివృద్ధిలో భాగంగా పలు ప్రాజెక్టులు, పనులు మణుగూరుకు మంజూరవుతున్నా.. వీటిలో కొన్ని స్థానికంగా కాకుండా పక్క మండలాలకు, పక్క జిల్లాలకు తరలిపోతున్నాయి. ఈ కోవకు చెందిందే మణుగూరు మున్సిపాలిటీ చినరాయిగూడెం-పర్ణశాల గోదావరి నదిపై బ్రిడ్జి ప్రతిపాదన.

నిధులు వెనక్కి

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆనాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హయాంలో చర్ల, వెంకటాపురం గ్రామాలకు, భద్రాచలం పుణ్యక్షేత్రానికి స్థానిక ప్రజల దూరభారం కష్టాలను తగ్గించేందుకు చినరాయిగూడెం గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.90కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల్లో ఆ నిధులు పాలేరు అభివృద్ధికి పనులకు మళ్లించారు. దీంతో చినరాయిగూడెం బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదన మరుగునపడినట్లు అయింది.

మణుగూరుకు ఎందుకు దూరమౌతున్నాయో!?

చినరాయిగూడెం గోదారిపై బ్రిడ్జి నిర్మాణం జరిగితే అవతలి ఒడ్డుకు చేరేందుకు తమ దూరభార కష్టాలు తొలగిపోతాయని, తమ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆశ పడ్డ చినరాయిగూడెం, కమలాపురం ప్రాంతాల ప్రజలకు నిధుల దారి మళ్లింపుతో నిరాశే మిగిలింది. ఆనాడు చినరాయిగూడెం గోదావరి బ్రిడ్జే కాదు, నేడు నవోదయ విద్యాలయం, తీగల వంతెన, రెసిడెన్షియల్ పాఠశాలలన్నీ.. మణుగూరుకు దూరమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమో.. స్థానికంగా వనరుల కొరతతో గాని మణుగూరు అందాల్సిన ఫలాలు పక్క మండలాలకు తరలిపోతున్నాయి. దీనిపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

తీగల వంతెనతో మేలు..

గతంలో మల్లేపల్లి గోదావరి అంటేనే పార్క్. పచ్చని చెట్లతో ఒక ఆహ్లాదకరమైన వాతావరణం. మంచి పర్యాటక ప్రాంతంగా, పిక్నిక్ స్పాట్‌గా ఉండేది. మణుగూరు ఓసీ ఏర్పాటుతో మణుగూరు ప్రాంత ప్రజలు ఆ ఆనందాలకు, ఆహ్లాదానికి దూరమయ్యారు. మరలా అదే రీతిలో చినరాయిగూడెం గోదావరి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకుల తాకిడి ఉంటుంది. చినరాయిగూడెం గోదావరి నదిపై తీగల వంతెను నిర్మించి, ఇంటెక్‌వెల్ సమీపంలో ఆహ్లాదకరమైన పార్క్ ఏర్పాటు చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందనేది స్థానికుల మాట. ఈ తీగల వంతెనతో గోదావరి అవలి ఒడ్డున ప్రాంతాలకు దూరభారం తగ్గడమే కాకుండా రాకపోకలకు సులువుగా, ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. అవతాల ఒడ్డున ఉన్న పర్ణశాల సరాసరిగా రూటు ఏర్పడుతుంది. ఈ దిశగా స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సకాలంలో ఎరువులు అందించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ తాతారావు

కరకగూడెం: ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సక్రమంగా ఎరువులను అందించాలని మణుగూరు ఏడీఏ తాతారావు సంబంధిత అధికారులు, డీలర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం మండలంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల కొరత లేకుండా చూడాలని, కృత్రిమ కొరత సృష్టించినా.. అధిక ధరలకు విక్రయించినా.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించాలని ఆయన సూచించారు. క్లస్టర్ ఏఈఓ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన వర్షపు నీరు



గుట్టమల్లారంలోని ఓ ఇంట్లో చేరిన వర్షపు నీరు

మణుగూరుటౌన్: మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో పలుచోట్ల నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుట్టమల్లారంలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలోని లోతట్టు ప్రాంతంలోని ఓ నివాసంలో వరద నీటి ప్రభావంతో ఇల్లు నీట మునిగింది. పట్టణంలోని బాపనకుంటలో రోడ్డుపై వరద నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాపనకుంటను సీపీఐ మండల, పట్టణ నాయకులు వరద నీటితో నిండిన బాపనకుంటలోని ఓ వీధిని సందర్శించారు. మున్సిపాలిటీ అధికారులు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని బ్లీచింగ్ చల్లించి రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీతారామచంద్ర స్వామివారి దేవస్థాన సమీపంలోని కుసుమ హరినాథ్ బాబా దేవాలయ అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని పాలకమండలి సభ్యులు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామాలయ మాడ వీధుల విస్తరణలో భాగంగా ఇళ్లను తొలగించడంతో ఆలయం చుట్టు ఉన్న మట్టి పడిపోయిందని, దీనివల్ల ఆలయం కూలిపోయ్యే ప్రమాదం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, కృష్ణార్జునరావు, నరసింహాచారి, సీత, పుజాత తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వంశీకృష్ణ

దుమ్ముగూడెం: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు మర్మం చంద్రయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించగా.. వంశీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో కోర్స చిలకమ్మా, కల్లూరు వీరభద్రం, కాక కృష్ణ, పెనుబల్లి ప్రసాద్, సోడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాథం కోరారు. సారపాక గ్రామపంచాయతీ కార్మికులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బత్తుల వెంకటేశ్వర్లు,రాయల వెంకటేశ్వర్లు, యాకుబ్, సురేష్, చారి పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

భద్రాచలంఅర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించగా.. ఇందుకు సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్), బీఆర్ఎస్ పార్టీలతో పాటు సీఐటీయూ, ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, ఐద్వా వంటి ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎంబి.నర్సారెడ్డి మాట్లాడారు.

అశ్వారావుపేటరూరల్: సమ్మె జయప్రదం కోరుతూ.. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు గోకినపల్లి ప్రభాకర్, పిట్టల అర్జున్, వగ్గెల అర్జున్‌రావు, నూకవరపు విజయ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్..

మణుగూరురూరల్: సమ్మెకు సంబంధించి సోమవారం ఏరియా ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్‌కు మణుగూరు ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కొడిపల్లి శ్రీలత, ఎస్‌డి నాసర్‌పాషాలు నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.రకీబ్, మంగీలాల్, వెంకటనారాయణ, రామకృష్ణ, నాగరాజు, తులసి, గురుప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు దూరంగా ఉండండి..



మణుగూరుటౌన్: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్

మణుగూరుటౌన్: సింగరేణి కార్మికులు సార్వత్రిక సమ్మెకు దూరంగా ఉండాలని ఏరియా ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్ కోరారు. సోమవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో కార్మిక సంఘాల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు సంబంధించినవి కాదని, ఒక్కరోజు సమ్మెతో కంపెనీకి కోల్పోయే ఉత్పత్తి నష్టం విలువ సుమారు రూ.76కోట్లు ఉంటుందని తెలిపారు. అధికారులు శ్రీనివాసచారి, శ్రీనివాస్, సీతారాంబాబు, రామారావు, చంద్రశేఖర్, రమేష్, జ్యోతిర్మయి, రమేశ్‌బాబు, మదన్‌నాయక్, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు అర్హత లేదు..'

దుమ్ముగూడెం: కాంగ్రెస్ పార్టీ ఎంపీ బాలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ నాయకుడు లంకా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. తాలిపేరు ప్రాజెక్టు సంబంధించిన నిధులు కాంగ్రెస్ నాయకులు తినేశారని నిర్ధారణ లేకుండా మాట్లాడడం, ఎమ్మెల్యే పనితీరును విమర్శించడం సరైనది కాదని హితవు పలికారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ అన్నెం సత్యాలు, నాయకులు తిరుపతిరావు, మట్టా శివాజీ, చందు, వర్ష చిన్నారావు, పిలక వెంకటరమణ రెడి పాల్గొన్నారు.

పీరీల ఊరేగింపు..



కరకగూడెంలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

కరకగూడెం: మండలంలో మొహరం వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని పీరీల చావడి వద్ద కొలువుదీరిన పీరీలను ముజావర్లు సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా గ్రామాల్లో తీసుకువెళ్లారు.ఈ ఊరేగింపులో భక్తులు కుల మతాలకు అతీతంగా పాల్గొన్నారు. ఊరేగింపు పొడవునా భక్తులు ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరించుకుంటూ దుఃఖంతో కూడిన ప్రార్థనలు, దుఆలు పఠించారు. అలాగే కొందరు భక్తులు ముఖ్యంగా మహిళలు ఇమామ్ హుస్సేన్ కర్బలాలో ఆకలి, దప్పికతో పడిన కష్టాలకు గుర్తుగా ఉపవాసం ఉన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండ, పోకలగూడెం పంచాయతీల్లో మండల వైద్యాధికారిణి డాక్టర్ కనకం తనుజ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. టీబీ వ్యాధిపై ఎక్స్‌రే, రక్తమూనాల సేకరణ, చిరు వ్యాధులపై పరీక్షలు చేశారు. ఐసీటీసీ వైద్యబృందాలు 12వ తేదీ వరకు మండలంలోని పంచాయతీల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాయని పేర్కొన్నారు. మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోనూ ఒడ్డుబజార్‌లో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక రోగులను పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. హెచ్ఎస్ ప్రకాష్‌రావు, సిబ్బంది సోనియా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

26, 27న సీపీఐ మహాసభలు

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 26, 27వ తేదీల్లో అశ్వారావుపేటలో నిర్వహించే సీపీఐ మూడో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మహాసభ సమాయత్త సభలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ శతవసంతాల స్ఫూర్తితో జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు ఎస్‌డి.సలీం, నరాటి ప్రసాద్, గన్నిన రామకృష్ణ, నూకవరపు విజయ్‌కాంత్, వగ్గెల అర్జున్, పఠాన్ జలాల్‌ఖాన్, ఎస్.ధర్మ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



అశ్వాపురం: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



అశ్వారావుపేటరూరల్: రింగ్‌రోడ్ వద్ద అధికారులు, విద్యార్థుల మానవహారం..

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం అశ్వారావుపేటలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం స్థానిక రింగ్ రోడ్‌లో మానవహారాన్ని నిర్వహించి, పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలను నాటి సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించగలమని అన్నారు. కార్యక్రమంలో పాల్వంచ ఎఫ్‌డీఓ కె.దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంఈఓ ప్రసాద్‌రావు, ప్రిన్సిపాల్ అనిత, సంగీత, ఫారెస్టు రేంజర్లు మురళీకృష్ణ, శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

అశ్వాపురం: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటిని బాధ్యతతో పెంచి వృక్షాలుగా మార్చాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ సమీపంలో నీటిపారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే పాయం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నీటిపారుదల శాఖ ఎస్‌ఈలు శ్రీనివాసరెడ్డి, రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, తూము వీరరాఘవులు, ఆవుల రవి, స్థానికులు, నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి



పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన సమితిసింగారంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. తొలుత వెన్నమల్ల జార్జీ స్తూపం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ.. పంచాయతీ పరిధి గ్రామాల్లోని డ్రెయినేజీల పూడికలు తీయించాలన్నారు. వీధుల చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కోరారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొడిశాల రాములు, పిట్టల నాగమణి, దామల్ల వెంకన్న, నిర్మల, కమలమ్మ, విజయ, పద్మ, ముత్యాలు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

'రహదారి మరమ్మతులు పట్టని అధికారులు'

బూర్గంపాడు: సారపాక-బూర్గంపాడు మధ్య ఆర్ అండ్‌బీ రహదారి గోతులమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం సీపీఎం ప్రతినిధి బృందం ఈ రహదారిలోని గోతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దపెద్ద గోతులతో ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాండవుల రామనాథం, రాయల వెంకటేశ్వర్లు, ఇనపనూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: విధి నిర్వాహనలో ఉన్న చర్ల తాలిపేరు ప్రాజెక్టు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ తిరుపతిపై అనుచిత వ్యాఖ్యలు చేసి బీఆర్ఎస్ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓస్ జిల్లా కమిటీ కోరారు. పట్టణంలో సోమవారం జరిగిన టీఎన్జీఓస్ జిల్లా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులపై రాజకీయ నాయకుడు అసభ్య పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండించారు. కఠిన చర్యలు తీసుకోవాలని, అధికారిని దూషించిన నాయకుడు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంగం వెంకటపుల్లయ్య, మహేష్, దెక్క నరసింహారావు, బాలకృష్ణ, భూషణం, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ములకలపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతోపాటు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేడుకల్లో తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేశారు. ర్యాలీలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్

అమెర్ద రహదారికి మోక్షమెన్నడు?

- శంకుస్థాపన చేసి నాలుగున్నర ఏళ్లు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- గుంతల దారిలోనే రాకపోకలు




గుంతలమయంగా ఉన్న అమెర్ద రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద రహదారికి మోక్షం కలగడం లేదు. మండల కేంద్రంలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి అమెర్ద వరకు రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గుంతలమయంగా తయారైంది. దీంతో అమెర్ద గ్రామ పంచాయతీలోని అమెర్ద కాలనీ, కొర్సవారిగూడెం, తెల్లంవారిగుంపు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం అధికారులు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నప్పటికీ దీనిని పట్టించుకున్నవారు లేరు.

బ్యారేజ్ నిలిచిపోవడంతో..

మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి అమెర్ద మీదుగా అమ్మగారిపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై-3వ బ్యాచ్ నిధులు రూ.343.06 లక్షలతో రహదారి నిర్మాణానికి 28 అక్టోబర్ 2020న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. రహదారి పనులు చేపట్టి ఎర్త్‌వర్క్ పనులు చేపట్టారు. తారు రోడ్డు పనులు చేపట్టవలసి ఉంది. ఈ రహదారిపై సీతమ్మ సాగర్ బ్యారేజీ, సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు సంబంధించిన వాహనాలు, భారీ యంత్రాలు తిరిగితే నిర్మించిన రహదారి పాడవుతుందని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రహదారిని ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేపడతామనడంతో రహదారిని నీటిపారుదల శాఖకు బదలాయించారు. రహదారి పనులు మాత్రం ప్రారంభం కాలేదు. సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణం నిలిచిపోవడంతో రహదారికి మోక్షం కలగడం లేదు. అధికారులు, ప్రభుత్వం స్పందించి రహదారిని నిర్మించాలని రహదారి నిర్మాణంపై ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రయాణం కష్టంగా ఉంది..



రహదారి గుంతలమయంగా ఉండి రహదారిపై ప్రయాణించాలంటే కష్టంగా ఉంది. మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రహదారి నిర్మాణాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రహదారి నిర్మించాలి.

– ఇరుగు కోటయ్య, అమెర్ద కాలనీ

అధికారులు స్పందించాలి..



అమెర్ద రహదారి శంకుస్థాపన చేసి నాలుగున్నర ఏండ్లు అయింది. అయినా రహదారి నిర్మించలేదు. ప్రస్తుత రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నాం. అధికారులు, ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మించాలి.

– బోళ్ల గంగరాజు, అమెర్ద